పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సజావుగా గ్రూప్-2 పరీక్షలు

ప్రజాశక్తి- అనంతపురం

గ్రూపు-2 పరీక్షలు అనంతపురంలో సజావుగా జరిగాయి. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో జరిగిన గ్రూప్-2 పరీక్షల్లో ఉదయం జరిగిన పరీక్షల్లో 88.61 శాతం మంది హాజరవగా, మధ్యాహ్నం పరీక్షకు 88.31 శాతం మంది హాజరయ్యారు. ఊగిసలాటల మధ్య సాగిన ఈ పరీక్షలకు కొంత మంది సకాలంలో చేరుకోలేకపోయారు. రెండు నిమిషాల మందుగానే వచ్చినా పరీక్షా కేంద్రంలో అనుమతించలేదని గణేష్ అనే అభ్యర్థి వాపోయాడు. మొత్తంగా చూసినప్పుడు పరీక్షలు సజావుగా జరిగాయి. మొత్తం 7293 మంది అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాయల్సి ఉండగా 6461 మంది హాజరయ్యారు. 832 మంది గైర్హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 6441 మంది హాజరవగా 852 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నుంచి పరీక్షల ఏర్పాట్లు ,నిర్వహణను జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ పరిశీలించారు. పివికెకె కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టరు శివనారాయణ శర్మ, జిల్లా ఎస్పీ జగదీశ్‌కు ఎస్ఎస్‌బిఎన్‌లో పరిశీలించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

అనంతపురం క్రైం : స్థానిక ఎస్ఎస్బిఎన్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, నలంద, ఎస్వీ డిగ్రీ కళాశాల, జెఎన్టీయు, రైపర్, అనంతలక్ష్మి, కెఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పి.జగదీష్ ఆదివారం పరిశీలించారు. బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాలలో పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు, మాల్ ప్రాక్టీస్ వంటి సంఘటనలు జరగకుండా పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకున్నారు. పరీక్ష పూర్తయ్యేవరకూ అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 10 నుంచి 12.30 గంటలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ 2 పరీక్షలు కొనసాగాయి

క్లాప్ ...అట్టర్ ఫ్లాప్

హిందూపురంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనాలు (ఫైల్‌ఫోటో)

'ఫైనాన్స్' స్వాధీనంలో చెత్తసేకరణ వాహనాలు

ఆగిన ఇంటింటి చెత్తసేకరణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అనే పేరుతో గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం ఫ్లాప్ కార్యక్రమంగా ముగిసింది. అనంతపురం జిల్లాలో ఈ కార్యక్రమం అమలు జరుగుతున్న ఐదు చోట్ల ఆగిపోయింది. గత కొన్ని రోజులుగా ఇంటింటి చెత్తసేకరణ జరగడం లేదు. దీంతో పాత పద్ధతుల్లోనే చెత్త సేకరణను ఆయా మున్సిపాలిటీలు చేపట్టాయి గత వైసిపి ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో ప్రత్యేకంగా మినీ వాహనాలు కొనుగోలు చేసి ఇంటింటికి చెత్తసేకరణను ప్రారంభించారు బయట ఎక్కడా చెత్త కనిపించకూడదన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా సాగింది. కాని ఇప్పుడు చెత్తసేకరణ వాహనాలకు ఫైనాన్స్ కంతులు చెల్లించలేదని ఆయా సంస్థలు తమ వాహనాలను తీసుకెళ్లాయి. దీంతో చెత్తసేకరణ ఆగిపోయింది.

జిల్లాలో ఐదు చోట్ల ఆగిన కార్యక్రమం

అనంతపురం జిల్లాలో క్లాప్ కార్యక్రమం కింద అనంతపురం నగర పాలక సంస్థ, గుంతకల్లు పురపాలక సంఘంలో ప్రారంభించారు. ఇక సత్యసాయి జిల్లాలో ధర్మవరం, కదిరి, హిందూపురంలో చేపట్టారు. అనంతపురం నగరంలో 66747 గృహాల నుంచి చెత్తను సేకరించేందుకుగానూ 60 వాహనాలను ఏర్పాటు చేశారు. ఇక గుంతకల్లు పురపాలక సంఘంలో 34898 గృహాలకుగానూ 30 వాహనాలు, సత్యసాయి జిల్లాలోని కదిరిలో 21108 గృహాలకుగానూ 15 వాహనాలు, హిందూపురంలో 32793 గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు 25 వాహనాలు ఏర్పాటు చేశారు. ఇక ధర్మవరంలో 34814 గృహాల నుంచి చెత్తను సేకరించేందుకు 25 వాహనాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ వాహనాలను ఏర్పాటు చేసే సమయంలో దీనికి పురపాలక సంఘం నుంచిగాని, ప్రభుత్వం నుంచిగాని నిధులివ్వకుండా చెత్త సేకరణ వాహనాలను బ్యాంకులు, ప్రయివేటు ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పుగా తీసుకుని వాహనాలను కొనుగోలు చేశారు. ఈ వాహనాల నుంచి చెత్తసేకరించే వారు విధిగా ప్రతి ఇంటి నుంచి చెత్త పన్ను వసూలు చేసి ఫైనాన్స్ సంస్థకు కంతుల వారీగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రజల్లో చెత్త పన్నుల చెల్లింపుపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. అదే సమయంలో తాము అధికారంలోకి వస్తే చెత్త పన్నును రద్దు చేస్తామని ప్రతిపక్షంలో టిడిపి హామీనిచ్చింది. ఈమేరకు చెత్తపన్నుపై నిర్ణయం చేసింది. అదే సమయంలో ఇప్పటి వరకు కంతులు కట్టకుండా ఉన్న వాహనాలను ఆయా ఫైనాన్స్ సంస్థలకు అప్పగించాలని కూడా నిర్ణయించింది. దీంతో వాహనాలు లేకుండాపోయాయి. ఫలితంగా ఇంటింటి చెత్తసేకరణ పూర్తిగా ఆగిపోయింది.

ఉన్న సిబ్బందిపై తీవ్ర పని ఒత్తిడి

ఇంటింటి చెత్త సేకరణ ఆగిపోవడంతో పాత పద్ధతుల్లోనే పారిశుధ్య నిర్వహణ జరగాల్సి వస్తోంది. అసలే తగినంత మంది సిబ్బంది లేరు. దీంతో ఉన్న పారిశుధ్య కార్మికులపై పని భారం విపరీతంగా పడుతోంది. ఉదాహరణకు అనంతపురం నగర పాలక సంస్థలో పారిశుధ్యం, ఇంజనీరింగు కార్మికులందరూ కలిపి 1400 మంది వరకు అవసరమవుతారు. కాని పని చేస్తున్న సిబ్బంది మాత్రం 680 వరకే ఉన్నారు. సగంకంటే తక్కువగానున్న సిబ్బందితో అనంతపురం నగరం పారిశుధ్య నిర్వహణ ఇబ్బందికరంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు క్లాప్ ఎత్తిపోయి..మరోవైపు సిబ్బంది కొరత నెలకొన్న తరుణంలో పారిశుధ్య నిర్వహణ అన్ని పురపాలక సంఘాల్లో సమస్యగానే మారింది.

ప్రజల ప్రాణాలను కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

డంపింగ్ యార్డ్ నుండి వస్తున్న కలుషితమైన గాలి, పొగ ,దుర్వాసన నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, నగర కార్యదర్శి వి. రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక విలేకరులతో కలసి నగరంలోని డంపింగ్ యార్డ్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనంతపురం నగరం నుండి, చుట్టూ ఉన్న మేజర్ గ్రామ పంచాయతీల నుండి డంపింగ్ యార్డులో రోజుకు 60 టిప్పర్లు,100 ట్రాక్టర్లతో చెత్తా చెదారాన్ని తీసుకొని వచ్చి డంపింగ్ యార్డ్‌లో వదులుతున్నారన్నారు. ఇంత పెద్ద ఎత్తున వస్తున్న చెత్తను ప్రాసెసింగ్ చేయకుండా గుట్టలు గుట్టలుగా వేయడంతో దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో 80 అడుగుల ఎత్తు చెత్త పేరుకు పోయిందన్నారు. దీని నుండి నగరంలోని కొన్ని ప్రాంతాలకు, రాజీవ్ కాలనీ పంచాయతీ, నారాయణపురం పంచాయతీ లో విపరీతమైన దుర్వాసనతో కూడిన పొగ, కలుషితమైన గాలి వీచి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. గతంలో చెత్తను ప్రాసెసింగ్ చేయడానికి 15 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి షెడ్ కట్టినా ఇవి ఏమాత్రం ఉపయోగ పడలేదని విమర్శించారు. పగటి పూట ఇంత పొగ ఉంటే రాత్రుల్లో ఎంత ఉంటుందో పాలకులు, మున్సిపాలిటీ అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. ఈ డంపింగ్ యార్డ్ వలన వృద్ధులకు, చిన్న పిల్లలకు ఊపిరితిత్తుల సమస్య, శ్వాసకోశ సంబంధ వ్యాధులు, అలర్జీ, సైనసైటిస్‌లతో పాటు ఈ మధ్య కాలంలో ఈ ఏరియాలో క్యాన్సర్ బారిన పడుతున్న రోగుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛమైన గాలి కోసం కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నా ఈ డంపింగ్ యార్డ్ ను ఎందుకు తరలించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పేరుతో, రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర పేరుతో , అనంతపురం పాలకమండలి స్వచ్ఛ అనంతపురం పేరుతో ప్రజలను మభ్యపెడుతూ కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు.ఈ డంపింగ్ యార్డ్ మున్సిపల్ అధికారులకు, పాలకులకు కామధేనువుగా తయారైందని విమర్శించారు. ఇప్పటికైనా ఈ డంపింగ్ యార్డ్ ను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజ, రాజీవ్ కాలనీ ఉపసర్పంచి మసూద్ వలీ, నగర కమిటీ సభ్యులు బాలకృష్ణ, వెంకటేశు, ఇస్మాయిల్, బేల్దార్ భాషా తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సోషలిజం అనివార్యం

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

రెడ్ బుక్ సదస్సు లో నాయకుల ఉద్ఘాటన

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

దోపిడీ లేని సమాజం సోషలిజంతో వస్తుందనికార్మిక, రైతు, ఇతర వర్గాల ప్రజలను ఐక్యం చేసి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమైంద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నివి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం నగర కమిటీ అధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా రాజ్యం - విప్లవం పుస్తకం పై సదస్సును స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య వక్త గా హాజరైన రాంభూపాల్ మాట్లాడుతూ రష్యా విప్లవ నేత విఐ. లెనిన్ రాజ్యం విప్లవం అనే గ్రంధాన్ని 1917 రాశాడన్నారు. 1848 లో మార్క్స్, ఎంగెల్స్ రాసిన కమ్యూనిస్టు ప్రణాళిక ఆధారంగా రష్యాలో విప్లవం ద్వారా కార్మిక రాజ్యాన్ని తెచ్చిన నాయకుడు లెనిన్ అని చెప్పారు. ఇతరుల శ్రమ ద్వారా వచ్చిన మిగులును కాపాడుకోవడం కోసం రాజ్యం, రాజ్యాంగ యంత్రాంగం ఏర్పడిందన్నారు. బానిసలకు-బానిస యాజమాన్యాలకు, భూస్వాములకు - కూలీలకు, పెట్టుబడి దారులకు - వేతన కార్మికులకు మధ్య వర్గ వైరుధ్యాతతో ఉన్న సమాజంలో దోపిడీదారులకు రక్షణ కోసం రాజ్యం ఏర్పడిందన్నారు. రాజ్యాన్ని కాపాడడానికి రాజ్యాంగ యంత్రాంగం చట్టసభలు, కార్యవర్గం, పోలీస్, కోర్టులు,జైళ్ల లాంటివి పుట్టుకొచ్చాయని చెప్పారు. దోపిడీ లేని సమాజం సోషలిజం వస్తుందన్నారు. కార్మిక, రైతు, ఇతర వర్గాల ప్రజలను ఐక్యం చేసి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమవుతుందని అన్నారు. ఈ సదస్సు లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్ర కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు వెంకట నారాయణ, ముత్తుజా, ఎజీ రాజ్మోహన్, నగర కమిటీ సభ్యులు మసూద్, రాజు, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, లక్ష్మీ నరసమ్మ, వెంకటే, అశ్విని, హనుమంత రాయుడు, తిరుమలేశుని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు,

నాకు రూ. వంద కోట్లు ఉన్నాయి.. నాకే పని చెప్తారా?

ఎంపిడిఒకు పంచాయతీ కార్యదర్శి తలబిరుసు సమాధానం

ప్రజాశక్తి పుట్లూరు

'నాకు 100 కోట్లు ఉన్నాయి. నాకే పని చెప్తారా అంటూ ఒక పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవోను ప్రశ్నించిన సంఘటన పుట్లూరు మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని పి-4 సర్వే నిర్వహించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో స్థానిక ఎంపిడిఒ పంచాయతీ కార్యదర్శుల దిశానిర్దేశం చేశారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. అయితే మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి పి- 4 సర్వే నిర్వహించలేదు. దీంతో ఎంపిడిఒ పంచాయతీ కార్యదర్శిని నాలుగురోజుల క్రితం ప్రశ్నించారు. అయితే ఆ పంచాయతీ కార్యదర్శి తలబిరుసు సమాధానమిచ్చారు. ' రూ. వంద కోట్లు ఉన్న నాకే పనిచెప్తారా'? నేను పనిచేయడానికి రాలేదు.. పనిచేయించడానికి వచ్చాను. మీరు చెప్పే పని చేయను'అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడాడు. దీంతో ఎంపీడీవో ఖంగుతిన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హెచ్చరించగా అదే స్థాయిలో ఆ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా మాట్లాడాడు. ' మీరు కలెక్టర్‌కు చెబితే బిల్లులు మంజూరు చేయడం లేదని నేను కూడా ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో అక్కడే ఉన్న ఏవో, సీనియర్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిని మందలించారు. ' ఓ అధికారిని ఇలా మాట్లాడితే ఎలా' అని అంటే పంచాయతీ కార్యదర్శి వారిపై కూడా చిందులు వేశాడు.' ప్రతి ఒక్క అధికారి డబ్బులు తీసుకునే పని చేస్తున్నాడు' అంటూ వ్యాఖ్యానించాడు. 'నాకోసం ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే నేను లిఫ్ట్ చేయడం లేదు. ఇది నా రేంజ్' అని తలబిరుసుగా మాట్లాడాడు. 'నేను ఇక్కడ ప్రశాంతంగా ఉండడానికే బదిలీ చేయించుకున్నా.. పనిచేయడానికి కాదు.. నాకు పని చెప్పడానికి మీరెవరు' అంటూ ధిక్కారంగా మాట్లాడాడు. ఎంపిడిఒ కార్యాలయంలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పంచాయతీ కార్యదర్శి వైఖరికి మండలంలోని పలువురు అధికారులు, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉద్యోగి వల్ల మండలానికే చెడ్డపేరు వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : 2025-26 విద్యా సంవత్సరానికి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 24 నుంచి మార్చి 31వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరీక్ష రుసుం ఒసి, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

25లోపు పంట నమోదు చేసుకోవాలి

పుట్లూరు : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈనెల 25వతేదీలోపు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇది వరకూ పంట నమోదు చేసుకున్న రైతులు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ పథకాలకు అనర్హులు అవుతారన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

జిల్లా అటవీశాఖ అధికారి టి.చక్రపాణి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అడవుల సంరక్షణ అందిరి బాధ్యత అనిజిల్లా అటవీ శాఖ అధికారి టి. చక్రపాణి స్పష్టం చేశారు. అడవులలోని వృక్షాల వల్ల స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం వస్తుంది. మేఘాలను ఆకర్షించి వర్షాలు కురవడానికి ఎంతో దోహదపడతాయి. ఎన్నో ఔషధాలు లభిస్తాయి. అడవులు లక్షలాది వన్యప్రాణులకు ఆవాసాలుగా ఉంటాయి. మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ అవసరం ఎంతైనా ఉంది. చివరకు చీపుర్లకు కావలసిన బోదగడ్డి కూడా అడవులలో లభ్యమవుతుంది. వంట చెరుకుతో పాటు పలు రకాల పండ్లు లభిస్తాయి. ఇన్ని ఉపయోగాలు ఉన్న అడవుల పరిరక్షణకు ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ మానవుని స్వార్థానికి ఏటా అడవులు నాశనం అవుతున్నాయి. అటవీ శాఖ అధికారుల కళ్ళుగప్పి ఇటుక బట్టీలకు, సామిల్లులకు టన్నుల కొద్ది కలప రవాణా చేస్తూనే ఉంటారు. కొంతమంది అధికారులు మామూళ్ల తీసుకుంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక వేసవి వచ్చిందంటే చాలు అడవులకు ఏదో ఒకచోట నిప్పు పెడుతూనే ఉంటారు. కొందరు పశువుల కాపర్లు, గొర్రెలు, మేకలు పెంపకదారులు, మరి కొంతమంది ఆకతాయిలు సిగరెట్ లేదా బీడీ తాగుతూ దట్టమైన అడవులలో పారవేయడం ద్వారా నిప్పు రగులుతూ పచ్చని వనాలు అగ్నికి ఆహుతి అవడం మనం చూస్తూనే ఉంటాము. మరికొంతమంది అజ్ఞానులు వేసవిలో ఎండిన గడ్డికి నిప్పు పెడితే తిరిగి వర్షాకాలంలో బాగా గడ్డి వస్తుందని కూడా నిప్పు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ అధికారి టి. చక్రపాణి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎంత? ఏయే ప్రాంతాల్లో అడువులు ఉన్నాయి.?

జవాబు : సత్య సాయి జిల్లాలో లక్ష 25 వేల హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది. జిల్లాలో మూడు అటవీ క్షేత్రాలు ఉన్నాయి. (రేంజ్ లు) కదిరి, బుక్కపట్నం, పెనుకొండ అటవీ క్షేత్రాలు ఉన్నాయి. భూభాగం విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలి. అప్పుడే పర్యావరణం సమతుల్యంగా ఉంటుంది. అయితే దురదృష్టవశాత్తు జిల్లాలో 14 శాతం వెనుకబడి ఉన్నాము. వాటిని భర్తీ చేయడానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ప్ర: ఈ వేసవిలో అడవులకు నిప్పు పెట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జ: అడవులకు అతి దగ్గరలో ఉన్న గ్రామాల ప్రజలకు నిప్పు పెట్టవద్దని కోరుతున్నాం. ఒకవేళ ఎవరైనా అజ్ఞానంతో నిప్పు పెడితే దానిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. గోడ పత్రికలు, కరపత్రాలు ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాం. అంతేగాక అడవులలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేశాం. వృక్షాలకు మధ్యన గుంత త్రవ్వడం వల్ల అగ్గి ముందుకు సాగకుండా ఈ ఫైర్ లైన్స్ ద్వారా అవకాశం ఉంది. ముఖ్యంగా గొర్రెలు, మేకలు, పశువుల కాపరులకు అగ్గిపెడితే జరిగే అనర్థాలు, నష్టం గురించి వివరిస్తున్నాం. అంతేగాక అడవులకు సమీపంలో గల రైతులు తమ పంట పొలాల్లో చెత్తను తొలగించే క్రమంలో అగ్గిపెడితే ఆ రైతులు అక్కడే ఉండి అగ్గి అడవిలోకి ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. అక్రమంగా కలపను తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : అటవీ శాఖ ద్వారా చేపడుతున్న ఇతర కార్యక్రమాలు ఏమిటి.?

జ: తమ శాఖ ద్వారా ఒక్కో అటవీ క్షేత్రంలో నగరవనాలు ఏర్పాటు చేస్తున్నాం. పుట్టపర్తి మండలంలోని అమగొండపాలెం, పెనుకొండ, చిలమత్తూరు మండలం చలివెందులలోని అటవీ క్షేత్రంలో ఈ నగరవనాలు ఏర్పాటు చేసాం. ఈ ఎకో పార్కుల వల్ల ప్రజలకు, పిల్లలకు విహారయాత్రలకు వచ్చే వారికి అహ్లాదపరిచే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో ఈ పార్కులను సందర్శించే ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది. వేసవిలో విశ్రాంతి కోసం ఎకో పార్కులను సందర్శించి సేద తీరవచ్చు.

ప్ర: సిబ్బంది కొరత ఉందా? మీ శాఖలో కొంతమంది సిబ్బంది అవినీతిపై ఏమంటారు.?

జ: సిబ్బంది కొరత ఉంది. దాదాపు 60 శాతం ఖాళీలు భర్తీ చేయవలసి ఉంది. వాటిపై ప్రభుత్వానికి నివేదించాం. ఈ వేసవిలో ఈ మూడు నెలల కోసం ప్రత్యేకంగా 15 మంది ఫైర్ వాచర్లను తీసుకోవడం జరిగింది. అలాగే మూడు అటవీ క్షేత్రాల్లో అటవీ సంరక్షణకై ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం. సిబ్బంది లో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే తప్పనిసరిగా శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ: ప్రజల సహకారం భాగస్వామ్యం లేకుంటే ఏ వ్యవస్థ నిలబడదు. అడవులను సంరక్షించడం కేవలం అటవీ శాఖతోనే సాధ్యం కాదు. అడవులు యొక్క ప్రయోజనాలు గుర్తించి ప్రజలు కూడా భాగస్వామ్యం అవుతూ అడవులను రక్షించుకోవాల్సి ఉంది.ఎవరో ఆకతాయిలు పెట్టిన నిప్పు వల్ల అడవులలోని కొన్ని వేల వన్య ప్రాణులు మాడి మసవుతున్నాయి. దీంతో కొన్ని జంతువులకు ఆహార కొరత ఏర్పడి జనావాసాలపై పడుతుంటాయి. పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి అయితే జరిగే నష్టాన్ని ఎవరూ పూరించలేరు. అందుకే ఈ వేసవిలో అడవులు మన సంపద అని భావించి వాటిని కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత ప్రజలందరిపై ఉంది. భూభాగంలో 33 శాతం అడవులు ఉండాలి. మనం 14 శాతం వెనుకబడి ఉన్నాం. దానిని అధిగమించడానికి అందరూ సహకరించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు 50 శాతం పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. అందుకు తగ్గట్టుగా అన్ని వర్గాల ప్రజలు అధికారులు పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

టి, చక్రపాణి

ఎప్పటికి పూర్తవుతాయో..!

ఏడేళ్లుగా కొనసాగుతున్న కెజిబివి భవన నిర్మాణాలు-ఆందోళనలో విద్యార్థినులు

పాఠశాల ఆవరణలో కింద కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థినులు. (ఇన్‌సెట్‌లో) కళాశాల భవనం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని కస్తూరిబా గురుకుల జూనియర్ కళాశాల భవనాలు గత ఏడేళ్ల నుంచి నిర్మాణంలోనే ఉన్నాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా తరగతి గదులు, వసతి గృహాలు లేకపోవడంతో గురుకుల కస్తూరిబా హైస్కూల్‌ను కూడా ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యాభ్యాసం, భోజనం ఒకేచోట చిందరగా ఉండని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక విద్యార్థులు నేలపైన విద్యాభ్యాసం, చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి కొనసాగుతున్నాయి. గతంలో రూ.1.80కోట్లతో కస్తూరిబా గురుకుల జూనియర్ కళాశాల భవనాలకు అప్పటి నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పుడు పూర్తవుతుందో అని విద్యార్థినులు ఎదురు చూస్తున్నారు. ఇటు హైస్కూల్ విద్యార్థినులు, అటు కళాశాల విద్యార్థినులకు తగినన్ని గదులు లేక ఇరుకు రూముల్లోనే కుర్చుంటున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపోవటం లేదని విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దు మండలం కావడంతోపాటు జిల్లా కేంద్రానికి 110 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కళాశాల భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు వసతితోపాటు నాణ్యమైన విద్యను అందించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై కస్తూరిబా గురుకుల బాలికల పాఠశాల నిర్వాహకురాలు (ఎస్ఓ) కమలమ్మను వివరణ కోరగా భవన నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని, త్వరలోనే పూర్తవుతాయని ఆశిస్తున్నామన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ

రాయదుర్గం : పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన హైస్కూల్ విద్యార్థులకు సేవాభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ప్రశంసాపత్రాలు, పతకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాయదుర్గం పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.జయనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటలు విని ఉన్నత చదువులు చదవాలన్నారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపివైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు కొట్రేష్, 'సేవాభారత్ వ్యవస్థాపక అధ్యక్షులు గంగాధర్, ఎపిఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఆత్మీయ బంధం సంస్థ అధ్యక్షులు నాగయ్య, శ్రీరామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనూషా, వివిధ సంస్థల ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మాజీమంత్రి జెసి దివాకర్‌రెడ్డి

జై విష్ణు ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని సాయినగర్ 3వక్రాస్‌లో నూతనంగా నిర్మించిన జై విష్ణు ఆసుపత్రిని మాజీమంత్రి జెసి దివాకర్‌రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ భరత్ విష్ణురెడ్డి, డాక్టర్ లీలాపద్మికి అభినందనలు తెలిపారు. అనంతరం భరత్ విష్ణురెడ్డి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా అనంతపురం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. వారి ఆదరణతో ఆధునిక సౌకర్యాలతో పూర్తిస్థాయి న్యూరో, ఆప్తమాలజీ వైద్య సేవలతో ఆధునిక హంగులతో జై విష్ణు ఆసుపత్రిని నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, సహాయ కార్యదర్శి అచ్చుత్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద వన్నూరు స్వామి అధ్యక్షతన అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్న ఆలోచన మరిచిపోవడం దుర్మార్గమన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులను నేటికీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు డెయిలీ లేబర్‌గానే కొనసాగిస్తుండటం బాధాకరమన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను తొలగించి ఏజెన్సీల ద్వారా అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు వేతనాలిచ్చే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఈనెల 24న జరిగే బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసే దిశగా ఆలోచన చేయాలని కోరారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్మికులు మరోసారి సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా జిల్లాలోని మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులపై కమిషనర్ల కక్ష సాధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పట్టణాల ప్రజలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న మూడేళ్ల సరెండర్ లీవ్‌లతోపాటు డిఎలు, ఇంక్రిమెంట్లు అమలు చేయాలని, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో 36 ప్రకారంగా వేతనాలు అమలు చేయాలని, కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇల్లు, స్థలాలు కేటాయించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని నేడు అనంతపురంలోని ఆర్‌డిఓ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నాలో మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు , శివ, తిమ్మప్ప, వెంకటరమణ, నటరాజు, అలివేలమ్మ, ఎల్లక్క, దుర్గమ్మ, తదితర కార్మికులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మొరుసు రమాదేవికి అవార్డు

అవార్డు అందుకుంటున్న నార్పల సరస్వతి విద్యా మందిరం డైరెక్టర్ రమాదేవి మొరుసు

నార్పల : నార్పల సరస్వతి విద్యా మందిరం డైరెక్టర్ రమాదేవి మొరుసుకు బ్రెయిన్‌ఫీడ్ ఎగ్జాంప్లరీ ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు-2025 లభించింది. ఈమేరకు ఆదివారం హైదరాబాదులో జరిగిన బ్రెయిన్‌ఫీడ్ ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ కాన్క్లేవ్-2025 కార్యక్రమంలో రమాదేవి అవార్డును అందుకున్నారు. రమాదేవి విద్యారంగంపై చేసిన పరివర్తన ప్రభావాన్ని కీర్తిస్తూ అవార్డును ప్రదానం చేశారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నార్పల : డాక్టర్ యు.కృష్ణామూర్తి జ్ఞాపకార్థం అరుణ్ చిన్నపిల్లల ఆసుపత్రి, స్వప్న పాత్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చామలూరు గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల డాక్టర్ ఎ.అరుణకుమార్, డాక్టర్ స్వప్న, బి.పప్పూరు ప్రాథమిక వైద్యకేంద్రం ఎంఎల్‌హెచ్‌పి మధుమాలతీ, ఆశావర్కర్ ఎం.యశోదమ్మ, మండల విస్తరణ అధికారి శైలజారాణి, సర్పంచు ఎ.స్వప్న, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు

బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నేటి విద్యార్థులు రేపటి సమాజ నిర్మాతలు అని ఎంఇఒ తిప్పే స్వామి అన్నారు. సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల పండుగ పోటీల విజేతలకు ఆదివారం కుందుర్పిలోని కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆట పాటలతో హాయిగా చదువుతూ విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లెనిన్‌బాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకంగా విలువల బడులను ఏర్పాటు చేసి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడం, ఎంతోమంది ప్రముఖుల ప్రశంసలను విలువల బడులు పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు, ఎపిటిఎఫ్ నాయకుడు తిమ్మప్ప, ట్రస్టు ముఖ్యులు టి.రాజు, జగదీష్, దిలీప్, మీన, ఉమాదేవి, కో ఆర్డినేటర్లు రఘువీరా, శ్రీకాంత్, ప్రభుత్వ ఉపాధ్యాయులు నింగప్ప, విలువల బడి ఉపాధ్యాయులు నాగరాజు, మర్రిస్వామి, గిరి ప్రసాద్, హనుమంతురాయుడు, లక్ష్మీ, సాయి, మంజు, ప్రసాద్, అఖిల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జీవితాల్లో నుంచి పుట్టేవే కథలు

'అనంత కథా కార్యశాల'లో వక్తలు

'అనంత కథా కార్యశాల' కార్యక్రమానికి హాజరైన అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మనుషుల జీవితాల్లో నుంచే కథలు పుట్టుకొస్తాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో డాక్టర్ అంకె శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నగరంలోని లలిత కళా పరిషత్ మినీహాల్‌లో అనంత కథా కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మన భూమిని మనకు కాకుండా చేస్తున్న వ్యవస్థలు, రాజ్యంపై కథలు రావాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితుల్లో దేశంలో భూమిని రాజ్యమే కార్పొరేట్లకు అప్పచెబుతోందన్నారు. ఇలాంటి సంక్లిష్ట స్థితిలో సాహిత్య కారుల పాత్ర క్రియాశీలకమైందన్నారు. నేడు ఆధునికుడు నేల నుంచి నీటిని పిండుతున్నాడన్నారు. అభివృద్ధి పేరుతో ఖనిజాలను తవ్వుకుంటూ విధ్వంసాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈ కోణాల్లో కథలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా ఫిబ్రవరి 25న ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా నాయకులు ప్రజ్ఞా సురేష్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్, జిల్లా నాయకులు జి.యమునారాణి, ప్రముఖ రచయిత్రి ఆర్.శశికళ, కథా రచయిత్రి డాక్టర్ ప్రగతి, కథా రచయిత టి.శ్రీనివాసమూర్తి, సీనియర్ రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, ప్రముఖ కవి రాజారామ్, అడవాల శేషగిరి రాయుడు, రషీద్‌బాషా, ముత్యాలన్న, అరుణ కాకి, షబానా, శోభామణి, ఉషారాణి, లక్ష్మీశ్యామ్, జిఎల్ఎన్.ప్రసాద్, విశ్వనాథరెడ్డి, నూరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు...

లైనింగ్ పనులు దేనికి సంకేతం

వైసిపి సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు అన్యాయం చేయాలని ఎవరు చూసినా సహించే ప్రసక్తే లేదని, రైతుల సంక్షేమం కోసం ఎంతటి ఉద్యమాలకైనా తాము సిద్ధంగా ఉన్నామని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి తో కలిసి ఉషశ్రీ చరణ్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ లైనింగ్ పనులు వేగవంతంగా చేపడుతున్నారని ఈ పనులు దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాలువల ద్వారా నీళ్లను అందించాల్సిన సమయంలో పనులు చేయాల్సిన అవసరం ఏముందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ లో 1.5 టీఎంసీ నీళ్లు ఉన్నాయనిఇందులో చట్టపరంగా కియా కు కేటాయించిన నీటిని వారికి వదలాల్సి ఉందని అన్నారు. దీంతోపాటు హిందూపురం పట్టణానికి తాగునీటికి సైతం ఇవ్వాల్సి ఉందన్నారు. మిగిలిన నీటిని ఎన్ని రోజులు కాలువల ద్వారా వదులుతారని ఎన్ని చెరువులను నింపుతారని అధికారులకు అడిగితే ఏ ఒక్కరు కూడా సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. తొలుత ఈ విషయాలను కూటమి పాలకులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. లైనింగ్ పనులు, కాలువల వద్ద ప్రొక్లైనర్లు, జెసిబిలను ఏర్పాటు చేసి, చేస్తున్న పనులను పరిశీలన చేస్తుంటే ఇక్కడి నుంచి కుప్పంకు నీటిని తీసుకెళ్లే విధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ హంద్రీనీవా కాలువల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులకు నీటిని అందించలేకపోయారన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో మడకశిర వరకు నీటిని తీసుకువెళ్లి అన్ని చెరువులను నింపిన ఘనత ఉందన్నారు. కొంతమంది టిడిపి నాయకులు ఆరు సంవత్సరాల తరువాత హంద్రీనీవా కాలవల ద్వారా నీటిని తీసుకొని వచ్చి చెరువులను నింపుతామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరిని మభ్య పెట్టడానికి ఈ ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. కరోనా విపత్కర సమయంలో సైతం గొల్లపల్లి నుంచి మడకశిర నియోజకవర్గంలో ఉన్న చిట్ట చివరి చెరువు వరకు నీటిని తీసుకువెళ్లి నింపిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుగొండ నియోజకవర్గంలో ఉన్న అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వని దుస్థితి ఉందన్నారు. హిందూపురం నాయకులు సామాజిక మాధ్యమాల్లో తొలుత మలుగూరు చెరువును కృష్ణా జలాలతో నింపుతామని ప్రచారం హోరెత్తించారన్నారు. ఈ ప్రచారంతోపాటు హిందూపురం నియోజకవర్గంలో ఎన్ని రోజులు నీళ్లను తీసుకొని వస్తారని ఎన్ని చెరువులను నింపుతారని చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను మోసం చేయడమే తప్ప వారిని ఆదుకోవాలన్న కనీస జ్ఞానం లేదని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తామని చెప్పి నేటికీ 20 రూపాయలు సైతం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని ధరల స్థిరీకరణ ఏర్పాటు చేయలేదని అన్నారు. రైతులు పడుతున్న బాధలను నేరుగా తెలుసుకోవాలని పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి గుంటూరులో మిర్చి యాడ్ కు వెళ్లి రైతులను కలిశారని ఆసమయంలో భద్రత కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. జగన్ బయటకు వస్తే కూటమి నాయకులు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. అందుకోసమే జగన్ పై అక్రమ కేసులు బనాయించడానికి సిద్ధమవుతున్నదన్నారన్నారు. తమ పార్టీ అధికారం మాత్రమే కోల్పోయిందని, జనాల్లో జగన్ పై ఉన్న అభిమానం కోల్పోలేదని అన్నారు. రైతులను రాజుగా చూసిన ఘనత వైసిపిది అని అలాంటి రైతులను అన్యాయం చేయాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు ఆసిఫ్ వుల్లా, కౌన్సిలర్లు శివ, షాజియా, మల్లికార్జున, వైసిపి నాయకులు నాగరాజు, రామకృష్ణారెడ్డి, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం

విలేకరులతో మాట్లాడుతున్న జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని జివిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం డిమాండ్ చేశారు. ఆదివారం ఉరుకొండలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ నెంబర్-2లో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగిస్తున్నా విద్యార్థులకు రావాల్సిన తల్లికి వందనం, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా నారాయణ, చైతన్య విద్యాసంస్థలతోపాటు అనేక విద్యాసంస్థల్లో నిత్యం ఏదో ఒకచోట విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించి కనీస మౌలిక వసతులను కనిపించాలన్నారు. ఈ సమావేశంలో జివిఎస్ఎస్ మండల నాయకులు గోపాల్‌నాయక్, నియోజకవర్గ కార్యదర్శి పవన్‌నాయక్, రాము, వెంకటేష్, కార్తీక్, హాస్టల్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంపేటలో విద్యుత్ లైన్ల మార్పు

మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమం ఎఫెక్ట్

నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రుద్రంపేట పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా ఉన్న విద్యుత్ సమస్యను అధికారులు పరిష్కరించారు. ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నిర్వహించిన 'మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో విద్యుత్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కాలనీల్లో కొన్నేళ్లుగా నెలకొన్న విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని, ముఖ్యంగా ఓల్టేజ్ సమస్య ఉందన్నారు. ఆదిలక్ష్మి విల్లాస్ ప్రాంతంలో విద్యుత్ లైనింగ్ లేదని వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ శాఖ అధికారులను పిలిచి సమస్యపై ఆరాతీసి విద్యుత్ సరఫరా కెవి కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పెంచాలని చెప్పగా అక్కడి నుంచే విద్యుత్ శాఖ ఎస్ఇతో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ శాఖ సిబ్బంది రెండు రోజుల నుంచి లైనింగ్ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న 100కెవి కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 160 కెవి కెపాసిటీని ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేని చోట కొత్త లైన్ లాగారు. అంతేగాకుండా పంచాయతీకి పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో నూతనంగా 12 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేశారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. దీంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్

పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలో ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తెలిపారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలోని మూగ బసప్ప కట్ట రోడ్డు, కామన్నా కట్ట, పార్క్ ఆంజనేయ స్వామి ఏరియా, గాంధీచౌక్, మాలగిరి, పలు ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్, మటన్ మార్కెట్లను పరిశీలించి పరిసర ప్రాంతాలను పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచడం, చెత్తను సమర్థవంతంగా నిర్వహిం చడం, ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యాలు అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయడం, తడి, పొడి చెత్త విభజన వంటి అంశాలపై ప్రజలకు మార్గదర్శకాలు అందించనున్నట్లు తెలిపా రు. పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించండి

హెచ్‌పిసిఎల్ రీజినల్ జనరల్ మేనేజర్ అశ్వనీకుమార్

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వాహనదారులు స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించాలని హెచ్‌పిసిఎల్ రీజినల్ మేనేజర్ అశ్వనీకుమార్ సూచించారు. ఈమేరకు స్వచ్ఛమైన ఇంధనంపై అవగాహన కల్పిస్తూ ఆదివారం అనంతపురంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి, అరవింద్‌నగర్, విద్యుత్ నగర్, మెడికల్ కళాశాల మీదుగా ఎస్ఎస్‌బిఎన్ కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన ఇంధనం, ప్రత్యన్నమైన ఇంధనం గురించి వినియోగదారులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ గంగాధర్, సీనియర్ సేల్స్ ఆఫీసర్ అబ్దుల్ ఆసీఫ్ సుమిత్‌కుమార్ వర్మ, సేల్స్ అధికారి శ్రీనివాసులు, హనుమాన్ గ్యాస్ ఏజెన్సీ డీలర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిఎంజెఎవై చెక్కులు పంపిణీ



పిఎంజెఎవై చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నియోజకవర్గ పరిధిలో షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు పిఎంజెఎవై పథకం మంజూరైన చెక్కులను ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో 8 మందికి రూ.12 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. సంఘాల్లోని షెడ్యూలు కులాల మహిళల అభ్యున్నతికి సున్నా వడ్డీ, సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ మధురానగర్‌లో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వేణుగోపాల్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు

నిబంధనలు విధిగా పాటించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో ఆటో డ్రైవర్లు భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నియమ నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ విజయకుమార్ సూచించారు. డీఎస్పీ ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆటో స్టాండ్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. పోలీసుల నిబంధనల మేరకు ప్రతి ఆటో డ్రైవర్ తప్పకుండా నిబంధనలు పాటిస్తూ ఆటోలను నడుపుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్లవద్దన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనం రికార్డ్స్ కలిగి ఉండాలని ఆదేశించారు. అలాగే ఫుట్‌పాత్‌పై ఎక్కడపడితే దుకాణాలు అక్కడ ఏర్పాటు చేయవద్దని, ఒక క్రమ పద్ధతిలో వాటిని ఏర్పాటు చేసుకొని ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పూల వ్యాపారులను ఆదేశించారు. ఎవరైనా రోడ్డుకు అడ్డంగా పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సిఐ సునీత, ఎస్ఐ శ్రీరాములు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'టీమ్ స్పిరిట్'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని మోతుకపల్లి వద్ద జరుగుతున్న డాక్టర్ వైయస్సార్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా టీం స్పిరిట్ జట్టు నిలిచింది. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆర్థిక సహకారంతో జరిగిన ఈ టోర్నమెంట్ లో 20 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో టిప్పుకాన్ స్టార్ జట్టు, టీం స్పిరిట్ జట్టు తలపడగా టీం స్పిరిట్ జట్టు 24 పరుగుల తేడాతో విజయం సాధించినట్లు నిర్వాహకులు, వైసిపి నాయకులు షబ్బీర్, గుడ్డం దాదాపీర్, షాహిద్, ఘౌసిఫ్, ఇర్ఫాన్, నయాజ్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్ లో గెలుపొందిన జట్టుకు రూ. 30 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందజేశారు. అలాగే రన్నరప్ గా నిలిచిన టిప్పు కాన్ స్టార్ జట్టుకు రూ.20వేల నగదు, ట్రోఫీని వైసిపి నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి అందజేశారు.